కథ

తాడేపల్లిగూడెంలో నవీన్‌చంద్ రైలు దిగేసరికి బాగా ప్రొద్దెక్కింది. స్టేషను బయటకి వచ్చి ఓ రిక్షావాడితో 'జగ్గన్న పేట జానాహై!' అన్నాడు.

''ఏంటి బాబూ?''

తన జేబులోంచి ఓ కాగితం తీసి చూపించాడతను. రిక్షావాడికి తెలుగు చదవటం రాదు. ఇద్దరు ముగ్గురు రిక్షావాళ్ళు తంటాలు పడి అతని సమస్యని పరిష్కరించారు. ఒకడు నవీన్‌ని తన రిక్షాలో కూర్చోబెట్టుకుని బస్టాండుకి తీసుకువెళ్ళాడు. ఎవర్నో పిల్చుకు వచ్చి ''ఈ అయ్య గోరు హిందీవోళ్ళు, జగ్గన్నపేట ఎల్లాలంట. కాత్త సెప్పండి బాబూ!'' అన్నాడు.

# గురుదక్షిణ

## తటవర్తి రామచంద్రరావు

నవీన్ ముఖం తెల్లగా పాలిపోయింది.

''గురువుగార్ని చూద్దామని మీరెంతో ఆశపడి ఇక్కడికి వస్తున్నారు. మీ శ్రమ వృధా అయిపోయి నందుకు నాకే బాధగా ఉంది. మీ పరిస్థితిని నేనూ హించగలను!'' అని అతని మీద ఓదార్పుగా చేయి వేసాడు బ్రహ్మం.

నవీన్ కళ్ళు తుడుచుకున్నాడు.

వచ్చీరాని హిందీలో ఎక్కడ్నుంచి వచ్చారని అడిగాడాయన. ఆ మాత్రానికే నవీన్‌కి ప్రాణం లేచొచ్చింది. తన వివరాలు చెప్పి తన దగ్గరున్న అడ్రసు కాగితాన్ని ఆయనకి చూపించి ''దయుంచి ఎలా వెళ్ళాలో చెప్పండి,'' అన్నాడు.

''నాతో రండి,'' అతన్ని వెంటపెట్టుకుని వెళ్ళాడాయన.

జగ్గన్నపేటకిప్పుడు ఆర్టీసీ బస్సులు వెళ్ళటం లేదని ఆటోలు దొరుకుతాయని చెప్పాడు ఎంక్వయిరీవాడు. ఆయన నవీన్‌ని ఆటోస్టాండు దగ్గరకి తీసుకు వెళ్ళాడు. అప్పటికే ఒకతను ఆటోలో కూర్చుని ఉన్నాడు.

''ఏటండీ? జగ్గన్నపేట వెళ్ళాలా?'' అని అడిగాడు ఆటోవాడు.

అవునని చెప్పి ఆటోలో కూర్చున్నతన్ని నవీన్‌కి పరిచయం చేసాడాయన.

''అలాగా! మాదీ ఆ వూరే! హిందీ చదువుకున్నా కాని ధారాళంగా మాట్లాడలేను. నా పేరు వీరబ్రహ్మం. నాతో రండి. మిమ్మల్ని మా వూరు చేరుస్తాను.''

ఆయనకి నమస్కరించి, ''మీ తెలుగు వారి గురించి ఎంతో విన్నాను. ఇప్పుడు కళ్ళారా చూస్తున్నా. భాష రాని చోట నన్నెంతో ఆదరిస్తున్నారు. మీరెప్పుడైనా హరిద్వార్‌కి వస్తే మా యింటికి వచ్చి మా ఆతిథ్యం స్వీకరించండి,'' అని ఓ కాగితం మీద తన అడ్రసు వ్రాసిచ్చాడు నవీన్.

ఆటో కదిలాక, ''మా వూళ్ళో హిందీ చదువుకున్న వాళ్ళున్నారు. కాని ఎవరికీ బాగా మాట్లాడ్డం రాదు. నిజం చెప్పాలంటే మాట్లాడే అవసరం రాక. ఎవర్ని కలుసుకుందామని వస్తున్నారు?'' అని అడిగాడు వీరబ్రహ్మం కుతూహలంగా.

తన జేబులోని అడ్రసు కాగితాన్ని చూపించాడు నవీన్.

వీరబ్రహ్మం తెల్లబోయాడు, ''ఆయనకీ మీకూ సంబంధమేమిటి?''

అతని కంగారుని గుర్తించని నవీన్ మందహాసం చేసి, ''మీరు నమ్మలేరు. కాని, ఆయన లేకపోతే నేనంటూ ఉండేవాణ్ణి కాదు.''

''మీరన్నదేమీ నా కర్థం కాలేదు.''

''గంగాధర శాస్త్రిగారు కాశీ విద్యా పీఠ్‌లో ఆచార్యుడిగా ఉన్నప్పుడు ఆయన దగ్గర నాల్గేళ్ళు సంస్కృతం నేర్చుకున్న భాగ్యశాలిని. ఇప్పుడదే నాకు బ్రతుకుతెరువు నిచ్చింది. ఏదయినా గురుదక్షిణ అడగండి ఆచార్యా సమర్పించుకుంటానంటే ఎప్పుడేనా నీకు వీలయితే మా వూరొచ్చి మా గాలి పీల్చి మా నీళ్ళు తాగి మా భోజనం తిని వెళ్ళు చాలన్నారు. ఇన్నాళ్ళకా భాగ్యం కల్గింది నాకు,'' అని నవ్వాడతను.

''అయ్యో! మీరాలస్యం చేసారు. ఆయన ఇక లేరు.''

''ఎంత ఘోరం జరిగిపోయింది? ఎప్పుడు? ఏమయింది?''

''నాల్గునెల్లనాడు హరిద్వార్ ఋషీకేశ్ యాత్రలకని కుటుంబ సమేతంగా వెళ్ళారు. ఋషీకేశ్ చూసుకుని హరిద్వార్ చేరాక గంగా స్నానం చేస్తున్నారుట! ఆయన భార్య మెట్ల మీద కాలు జారి నీళ్ళల్లో పడి



పోయిందిట. ఆయన పట్టుకోబోయి ముందడుగు వేసేసరికి లోతు తెలియక ఆయనా మునిగి పోయారట! కొడుకు, కోడలు హాహాకారాలు చేసారుట! ఈతగాళ్ళు ఎంత ప్రయత్నించినా వారి శవాలు కూడా దొరకలేదు. తమ చేజేతులా తల్లిదండ్రుల్ని గంగ పాలు చేసి వచ్చామని కొడుకు ఎంతగానో కుమిలి పోతున్నాడు.''

''ఏమయినా మీలాంటి శిష్యుణ్ణి పొందినందుకు ఆయన చాలా అదృష్టవంతులు. చిత్తశుద్ధితో ఆయన కిచ్చిన మాటకోసం మీరింత దూరం వచ్చారు. మావూరొస్తున్నారు. మా గాలి పీల్చి మా నీళ్ళు తాగి మా యింట్లో భోజనం చేయండి. ఎక్కడ వున్నా శాస్త్రి గారి ఆత్మ సంతోషపడుతుంది!''

బ్రహ్మం చేతులు పట్టుకుని తన కళ్ళ కద్దుకున్నాడు నవీన్.

కాశీలో ఆచార్య పదవిని విరమించాక స్వస్థలానికి తిరిగి వచ్చిన శాస్త్రి గారు ఎంతోమందికి విద్యాదానం చేసిన మహానుభావులని, పేద విద్యార్థులకి వారింట నిత్యాన్నదానం జరిగేదని, ఎంతోమంది జీవితంలో స్థిరపడి పైకి వచ్చారని, ఆయన కీర్తి దశ దిశలా వ్యాప్తి చెందిందని, ఇప్పుడా యిల్లు బోసి పోయినట్టుగా ఉందని ఎన్నో విషయాలు చెప్పాడు వీరబ్రహ్మం.

మరి కాసేపటికి ఆటో ఊరు చేరింది. నవీన్ డబ్బు లివ్వబోతుంటే ''మీరు మా అతిథులు'' అని నవ్వుతూ వారించాడు బ్రహ్మం.

''మీకు చాలా శ్రమ యిస్తున్నాను,'' అన్నాడు నవీన్ మొహమాటంగా.


''హరిద్వార్‌కి వచ్చినప్పుడు మిమ్మల్ని శ్రమ పెడతాలెండి.''

''మీరు చాలా బాగా మాట్లాడతారు.''

''నేనూ శాస్త్రి గారి శిష్యుడినే!'' అని నవ్వాడు బ్రహ్మం.

''మీ పనులకి నేనడ్డురావటం లేదు కదా!'' అన్నాడు నవీన్ బిడియంగా.

''లేదు. నేను మా కుల వృత్తి చేయటం లేదు. పెద్ద ఉద్యోగం చేద్దామని డిగ్రీ చదివాను. దేశం మీదకి వెడితే పనికొస్తుందని హిందీ పరీక్షలు పాస య్యాను. ఇప్పుడు బిల్డింగు కాంట్రాక్టులు చేస్తున్నాను. ఒకటే సుగుణం. ఈ పని ఈ వేళే చెయ్యాలని లేదు. మా యిష్టం. మీరు రావటం వల్ల నాకే యిబ్బందీ లేదు,'' అని భార్యని పిలిచి నవీన్‌ని పరిచయం చేసి



టీలు తెమ్మన్నాడు.

స్నానం చేసి వచ్చాక, "శాస్త్రి గారిల్లు ఎక్కడండి?" అని అడిగాడు నవీన్.

"పక్క వీధిలోనే. ఇంత దూరం ఎలాగా వచ్చారు; వాళ్ళబ్బాయి కళ్యాణ శాస్త్రిని కలిసే వెళ్ళండి. భోం చేసాక వాళ్ళింటికి వెడదాము."

నవీన్ గాఢంగా నిట్టూర్చాడు.

"కళ్యాణ్ చాలా మంచి వాడు. తల్లిదండ్రులకి నెల నెలా కర్మ కాండలు విధిగా జరిపిస్తున్నాడు."

"అయ్యో!" అన్నాడు నవీన్ చెవులు మూసుకుంటూ.

"వింటానికి బాధగా ఉన్నా మరి పితృదేవతలకి శ్రాద్ధ కర్మలు చేయాలి కదండీ! అంతే కాకుండా శాస్త్రిగారు చేయలేకపోయిన ఒక బాధ్యతని చక్కగా నిర్వర్తించాడు."

"ఏమిటి?"

"ఆయన పోయే నాటికి వారి చిన్న కూతురికింకా పెళ్ళి కాలేదు. క్రితం వారమే ఆ పిల్ల పెళ్ళి జరిగిపోయింది."

నవీన్ తెల్లబోయి చూసాడు.

"మీ ఆశ్చర్యమేమిటో నాకర్థమైంది. తల్లిదండ్రులు పోయిన సంవత్సరం లోగా కూతురి పెళ్ళి చేస్తే ఆ కన్యాదాన ఫలం వారికి దక్కుతుందని మా విశ్వాసం. కళ్యాణ శాస్త్రి తన విద్యుక్త ధర్మం నెరవేర్చుకున్నందుకు ఊరంతా అతన్ని మెచ్చుకుంటోంది. అలాంటి కొడుకుని కన్న గంగాధర శాస్త్రి గారు అదృష్టవంతులు...."

★ ★ ★

నవీన్ చంద్ హరిద్వార్‌లో తమ యింటికి చేరే సరికి అప్పుడే ఎల్లెడలా వెలుగు రేఖలు వ్యాపిస్తున్నాయి.

గంగాధర శాస్త్రి గారి విరిగి అతుక్కుంటున్న కాలికి వెన్నతో మాలిష్ చేస్తూన్న కాత్యాయని ఒక్క ఉదుటున పైకి లేచింది. "నాయనా నవీన్! వచ్చావా? మా వూరు వెళ్ళొచ్చావా? మా కళ్యాణ్‌నీ వాళ్ళనీ కలిసి వచ్చావా? వాళ్ళెలా ఉన్నారు. మేమిక్కడ ఉన్నామని తెలిసి ఏమన్నారు? మా వాడు నీతోనే రాకపోయాడా? పోనీ, ఎప్పుడు వస్తానని చెప్పాడు? మమ్మల్ని ఎప్పుడు తీసుకు వెడతానన్నాడు?" అంటూ ప్రశ్నలు వర్షం కురిపించింది.

మాట్లాడకుండా తలదించుకున్న నవీన్‌కి మంచి నీళ్ళు తెచ్చిచ్చి "మాతాజీ ప్రశ్నలకి జవాబు చెప్పరేమిటి?" అని అడిగింది అతని భార్య గుల్షన్.

"క్షమించండి ఆచార్యా! మీ వూరికి సరయిన దారి చెప్పే వాళ్ళు నాకు దొరక లేదు," అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు నవీన్.

"ఏమిటండీ? ఇంత చదువుకున్నాడు! మనూరికి దారి చెప్పే వాళ్ళు దొరక లేదంటాడేమిటి? ఎంతో మంచి కబురు తెస్తాడని ఎంతగా ఎదురు చూస్తున్నాము! ఎందుకిలా జరిగింది? మీ కెప్పటికి నయమవుతుందో, మనూరికి ఎప్పటికి వెళ్ళగలుగుతామో!" అంది కాత్యాయని ఉస్సురుమంటూ.

"అనవసరంగా హైరాన పడకు. వెళ్ళి స్నానం చేసి పూజ చేసుకునిరా! మనస్సుకి ప్రశాంతత చిక్కుతుంది" అన్నారు శాస్త్రిగారు.

కాత్యాయని నిరుత్సాహంగా వెళ్ళిపోయింది. ఆమె పూజ చేసుకొని వచ్చాక శాస్త్రిగారి మంచం పక్కనే కూర్చున్న నవీన్ కనిపించాడు. ఇద్దరినీ మార్చి మార్చి చూసింది ఆమె.

శాస్త్రిగారు బలవంతంగా నవ్వు తెచ్చి పెట్టుకొని, "నా శిష్యుడు గురు దక్షిణ సమర్పించుకున్నాడే కాత్యాయనీ!" అన్నాడు.

ఆమె చకితురాలైంది. "ఏమిటి మీరంటున్నది? మనూరికి దారి చెప్పే వాళ్ళే కనిపించలేదన్నాడు?!"

"అక్కడ జరిగింది విన్నాక, చూసాక మీకు నిజం చెప్పే ధైర్యం నాకు లేకపోయింది అమ్మా!" అన్నాడు నవీన్.

"ఏం జరిగింది? నువ్వేం చూసావు? ఏం విన్నావు?"

శాస్త్రిగారి వైపు చూసాడు నవీన్. అతని ముఖంలో ఎనలేని బాధ.

"మీ మాతాజీతో నిజం చెప్పు నవీన్! నేడు కాకపోతే రేపయినా తెలిసేదే!"

"నా నోటితో నేను చెప్పలేను ఆచార్యా!" అన్నాడు నవీన్ గద్గద స్వరంతో.

శాస్త్రిగారి ముఖం ప్రశాంతంగా ఉంది. "చివరకు నా అనుమానమే నిజమైంది కాత్యాయనీ! పుణ్య క్షేత్రాల్లో ముసలి తల్లిదండ్రులు తప్పిపోయారని పాపం కొడుకులు వెతుక్కుంటూ ఉంటారని మనం వింటూంటాం! కాని, మన కుమారుడికి మన మీద దయే తప్పింది!"

"ఏమిటండీ మీరనేది?"

"ఇలాంటిదేదో జరిగిందని ముందే ఊహించాను. మన సంగతి చెప్పకుండా అక్కడేం జరుగుతోందో చూసి రమ్మని నవీన్‌తో ముందే చెప్పి




## సింధూకి ఆఫర్ల మీద ఆఫర్లు....

బతుకమ్మలో తెలంగాణా ఆడపిల్లగా అందరినీ మెప్పించిన సింధుతులానీకి ఆఫర్ల మీద ఆఫర్లు వస్తున్నాయి. నితిన్ నటించిన విక్టరీ సినిమాలో టీవీ రిపోర్టర్‌గా సింధూకి మంచి పేరే తెచ్చిపెట్టింది. బ్లాక్ అండ్ వైట్‌లో ఫ్యాషన్ డిజైనర్‌గా గ్లామరస్‌గా కనిపించి ప్రేక్షకులకు కనువిందు చేయబోతోంది. రాజీవ్ కనకాల సరసన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నటించబోతున్న చిత్రం త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది. దీనికి సింధూనే డబ్బింగ్ చెప్పబోతోంది. ఈ చిత్రం నటిగా తనకు పూర్తి సంతృప్తిని ఇస్తుందని సింధూ చెబుతోంది. మరికొన్ని కథలు డిస్కషన్స్‌లో వున్నాయని, అవి ఓకే అయితే నటిగా మరింత బిజీ అవుతానని ఆమె అంటోంది.

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అంటారు. చక్కని కళ్ళుంటేనే అందమైన ఈలోకాన్ని ఆనందంగా వీక్షించవచ్చు. అందుకే కనులారా వీక్షించమని చెబుతారు. వాతావరణ కాలుష్యం, ఆధునిక టెక్నాలజీ, మన నిర్లక్ష్యం కారణంగా కళ్ళు వివిధ వ్యాధుల బారిన పడుతున్నాయి. కంప్యూటర్ల వాడకం ఎక్కువై పోయాక నేత్ర సంబంధమైన ఇబ్బందులు కూడా ఎక్కువైపోయాయి. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చుని

# అలసిన నేత్రాలకు చిట్కాలు



పనిచేసేవారు కొన్ని చిట్కాలు పాటిస్తే కళ్లు అలసటకి గురవ్వకుండా వుంటాయి.

* మీ నేత్రాలు ఆరోగ్యంగా ఉండాలంటే బాగా నిద్రపోవాలి. ఆరునుంచి ఎనిమిదిగంటల పాటు నిద్రపోతే అలసిన నేత్రాలు బాగా రిలాక్స్ అవుతాయి.
* ఆకుకూరలు, క్యారెట్, మునగకాయలు, బొప్పాయి, మామిడిపళ్ళు, ఇతర తాజా పండ్లు బాగా తీసుకుంటే నేత్రాలకు అవసరమైన విటమిన్ ఎ సమృద్ధిగా లభిస్తుంది. విటమిన్ ఎ లోపం కారణంగానే కళ్ళు ఎక్కువ ఇబ్బందులకు గురవుతుంటాయి.
* కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి అరగంటకొకసారి కళ్లకి విశ్రాంతి ఇవ్వాలి.
* వ్యాయామాలు బాగా చేసేవారికి నేత్ర సంబంధమైన ఇబ్బందులు తక్కువగా వస్తాయి. ఎందుకంటే శరీరంలో ప్రతి అవయవానికి రక్త సరఫరా సక్రమంగా సాగుతుంది.
* రోజుకి కనీసం 12 గ్లాసుల నీరు తాగడం ఆరోగ్యకరం.
* అస్తమానూ చేతులతో కళ్ళను రుద్దుకోకూడదు. చేతుల్లో ఉన్న మలినాలు కళ్లకి చేరి మంట పుడతాయి.
* చల్లని నీటితో కళ్లని కడుక్కోవడం ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. అలసిన కళ్ళు విశ్రాంతి పొందుతాయి.
* మీ కళ్లల్లో ఉన్న మలినాలు పోవాలంటే రెండు చుక్కల రోజ్‌వాటర్‌ని కళ్లల్లో వేసుకుంటే మీకళ్ళు కాంతివంతం అవుతాయి.
* కాటన్ బాల్‌ని పాలల్లో ముంచి కళ్లమీద పెట్టుకుంటే కళ్ళు రిలాక్స్ అవుతాయి. కళ్లని శుభ్రం చేయడంలో పాలు మంచి పాత్ర పోషిస్తాయి.
* కనురెప్పల్ని మూస్తూ తెరుస్తూ ఉండడం మంచి ఎక్సర్‌సైజ్. అందువల్ల కూడా కళ్ళు విశ్రాంతి పొందుతాయి.
* పనివేళలు బాగా ఉన్నప్పుడు సన్‌గ్లాసెస్ వాడడం మంచిది. అలాగే ఉదయం పూట సూర్యరశ్మి ఎక్కువగా ఉన్నప్పుడు కూడా అతినీలలోహిత కిరణాల నుంచి సన్‌గ్లాసెస్ కళ్లని రక్షిస్తాయి.
* ఇంట్లో ఉండేవాటితోనే మీ కళ్లని రిలాక్స్ చేసుకోవచ్చు. బంగాళాదుంప ముక్కల్ని లేదా కీరదోస ముక్కల్ని చిన్నగా కోసి కళ్లమీద పెట్టుకుని పదినిముషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. కళ్లకింద వలయాలున్నవారు ఈ ముక్కల్ని ఆ ప్రాంతంలో రుద్దడం వల్ల నలుపుదనం పోతుంది.

---

పంపించాను. నేను భయపడినంతా జరిగింది. మన కుమారుడు మనం బ్రతికుండగానే మన ఫోటోలకి దండలు వేసి పూజలు చేస్తున్నాడట!''

కాత్యాయని ముఖాన కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

''మనం గంగలో ప్రమాదవశాత్తూ పడిపోయామని ఇక్కడ ఏ పోలీసు రిపోర్టూ ఇవ్వలేదు. నిశ్చింతగా మనూరికి వెళ్ళిపోయారు. అందుకనే మన ఉత్తరాలకి జవాబులు రాయటం లేదు. అవి చింపి పారేస్తూ ఉండుంటారు. ఇంటి టెలిఫోను మార్చేసారు. మన కోసం వాళ్ళు వెతకడం లేదు సరికదా, మనం కాంటాక్టు చేయటానికి వీల్లేకుండా చేసారు. మన జ్ఞాపకార్థం ఏదయినా ఫోటో నివ్వమంటే ఈ మధ్య జరిగిన మన చిన్నమ్మాయి పెళ్ళి ఫోటో యిచ్చాడట.''

''మనం దగ్గర లేకుండా దాని పెళ్ళి చేసేసాడా?''

''మన మింత కాలం వద్దనుకుంటున్న వాడి తోనే దాని పెళ్ళి జరిపించాడు,'' అంటూ ఆ ఫోటోని భార్యకి చూపించాడు శాస్త్రిగారు.

పొంగి వస్తున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ ఫోటో వైపు చూసిందామె.

''భజరంగ్ పరిషత్ వాళ్ళు మనల్ని కాపాడి హాస్పటల్లో చేర్పించి ఉండకపోతే మనం నిజంగానే గంగలో కలిసిపోయుండే వాళ్ళం. అక్కడ నవీన్ యాదృచ్ఛికంగా చూసుండకపోతే మన మీ పాటికి ఏ గుడి మెట్ల మీదో ముష్టెత్తుకుంటూ ఉండుండే వాళ్ళం!''

''అంత మాటనకండి ఆచార్యా! ఈ నవీన్ బ్రతికుండగా మీకే లోటూ కలుగదు. మీరెక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేదు. నాకు తల్లిదండ్రులు లేని లోటు తీరుస్తూ ఇక్కడే ఉండి పొండి.''

★ ★ ★

ఓ రోజున నవీన్ స్కూలు నుంచి ఇంటికి వచ్చే సరికి, ''నేను బజారుకి వెళ్ళాను. పితాజీ పక్కింటి వాళ్ళకి తాళం చెవులిచ్చి మాతాజీని తీసుకుని వెళ్ళిపోయారుట!'' అంటూ ఓ కాగితం మడతని అతని చేత బెట్టింది గుల్షన్. అతను కంగారుగా తెరిచి చదవసాగాడు:

నాయనా నవీన్!

మా వాళ్ళ సంగతులు చెప్పి నువ్వు మాకెంతో మహోపకారం చేసావు. తన చెల్లెలు పెళ్ళి చేసి (రెండో పెళ్ళి వాడే అయినా) తన తండ్రి కర్తవ్యాన్ని నెరవేర్చాడని నా కొడుకుని లోకం మెచ్చుకుంటోంది. పిల్లలు శ్రాద్ధ కర్మలు చేస్తున్నారో లేదో పరలోకాలకి చేరిన పితృదేవతలకి తెలియదు; కాని మేమెంతో అదృష్టవంతులం. మేము బ్రతికుండగానే మా కుమారుడు మా కర్మలు విధాయకంగా నిర్వర్తిస్తున్నాడు. ఇలాంటి భాగ్యం ఏ తల్లిదండ్రులకీ దక్కదు. మే మడ్డు తొలగిపోయాము కనుక ఇంక మా యింట్లో పేద విద్యార్థుల విస్తళ్ళు లేవు. దాన ధర్మాలు చేయవలసిన బాదరబందీ మా వాడికి లేదు. నా కొడుకు ఒక మంచి పని మాత్రం చేసాడు. నేను వ్రాసిన పుస్తకాలన్నీ ఏ పాత పేపర్ల వాడికో అమ్మేయకుండా నీకిచ్చాడు. అవి చేరవలసిన చోటికి చేరాయన్న తృప్తి ఈ జన్మకి చాలు.

ఇక మేము మా వూరికి వెళ్ళవలసిన అవసరం కనిపించటం లేదు. నిజం చెప్పాలంటే వెళ్ళలేము. మేము వెడితే మా వాడి రహస్యం అందరికీ తెలిసిపోతుంది. కన్న కొడుకుని ఊరివాళ్ళు మెచ్చుకుంటే ఆనందించగలమే కాని దూషిస్తే భరించలేము. అందుకే, మేము అక్కడికి వెళ్ళలేము.

అలాగని మేమిక్కడ ఉండనూ లేము. నీ చిన్న సంసారంలో నీకున్న బాధ్యతలు నీకున్నాయి. నీ పై మా భారం పెట్టటం మాకు భావ్యం కాదు. చెప్పి వెడదామంటే మీరు వెళ్ళనివ్వరు. నీలాంటి ఉత్తముడైన శిష్యుడిని కొడుకుగా ప్రసాదించిన ఆ దైవానికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ మీ భార్యా బిడ్డలు కలకాలం సుఖంగా ఉండాలని దీవిస్తూ వెళ్ళిపోతున్నాము.

మేము జీవితంలో చరమాంక దశలో ఉన్నాము. మా చివరి రోజులు ఎక్కడైనా గడిచిపోతాయి. మా గురించి శ్రమ పడి వెతక వద్దు. అంతిమ క్షణంలో నీకు కబురు పంపమని ఆశ్రమ నిర్వాహకుల్ని అర్థిస్తాము.

బాధపడకు బాబూ! మీ యింట్లో గడిపిన తీపి గురుతులు మిగిలిన జీవితానికి చాలు.

– గంగాధర శాస్త్రి

❑